ఆర్‌కేపురంలో డెంగీ కలకలం

● 12 ఏళ్ల చిన్నారికి డెంగీ పాజిటివ్

ఎల్‌బీనగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్‌కాలనీలో డెంగీ కేసు బయటపడింది. స్థానికంగా ఉండే ఓ 12 ఏళ్ల చిన్నారికి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా డెంగీ పాజిటివ్ అని వచ్చింది. వివరాలు



డెంగీ లక్షణాలు ఉన్న చిన్నారి ఇంటి యజమాని నుంచి వివరాలు సేకరిస్తున్న ఉప కమిషనర్ బోనగిరి శ్రీనివాస్

ఇలా ఉన్నాయి.. నల్గొండకు చెందిన ఓ కుటుంబం నగరానికి వచ్చి టెలిఫోన్‌కాలనీలో నివసిస్తున్నది. వారి అమ్మాయి అభిజ్ఞ(12)కు ఈనెల 6న జ్వరం రావడంతో బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆ చిన్నారికి పరీక్షలు నిర్వహించగా డెంగీ పాజిటివ్ వచ్చింది. వైద్యులకు చూపించుకున్న ఆ కుటుంబం ఆదివారం నల్గొండకు వెళ్లింది. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ తన సిబ్బందితో డెంగీ లక్షణాలు కలిగిన చిన్నారి నివసించే ఇంటికి వెళ్లారు. అక్కడ వారు అందుబాటులో లేకపోవడంతో ఇంటి యజమానితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆ ఇంటి పరిసరాలలోని దాదాపు 150 ఇళ్లల్లో యాంటీ లార్వా ఆపరేషన్‌తో పాటు ఫైర్‌థమ్ చేయించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలలో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని స్థానికులకు సూచించారు. వారానికి ఒకసారి డ్రైడేగా పాటించాలన్నారు. దోమల వృద్ధిని అరికట్టడానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వృద్ధిని అరికట్టి వాటి ద్వారా వ్యాపించే వ్యాధుల నుండి సంరక్షించుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో తగు



టెలిఫోన్‌కాలనీలో దోమల నివారణ మందులను పిచికారీ చేయిస్తున్న ఉప కమిషనర్ బోనగిరి శ్రీనివాస్

జాగ్రత్తలు పాటిస్తు దోమలు వృద్ధిచెందే ప్రదేశాలను గుర్తించి నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి నిల్వలో పుట్టే దోమల కారణంగా డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. కూలర్లలోని నీటిని తొలగించడంతో పాటు నీటి ట్యాంకులపైన ఖచ్చితంగా మూతలు బిగించుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో నీటి నిలువకు ఉపయోపడే డబ్బాలు, కొబ్బరి బోండాలు, టైర్లు, ప్లాస్టిక్ కవర్లు ఉంటే తొలగించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రాంబాబు, సూపర్‌వైజర్ శ్యాంసుందర్, డీఎంటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు, హోమాలు

కొత్తపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం నేపథ్యంలో కొత్తపేట డివిజన్‌లో ఆదివారం మూతపడిన ఆలయాల్లో సోమవారం తెల్లవారు జామున సంప్రోక్షణ అనంతరం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. స్నేహపురికాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ప్రధాన వేంకటేశ్వరాలయం, విజయ వినాయకస్వామి, విశాలాక్షీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, అయ్యప్పస్వామి ఆలయం, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా మన్యుసూక్త హోమం నిర్వహించారు. అదేవిధంగా ఎస్ఆర్ఎల్‌కాలనీలోని శ్రీరామ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, కొత్తపేట పురాతన భక్తాంజనేయస్వామి ఆలయం, ఎస్‌బీహెచ్‌కాలనీలో, సత్యానగర్ కాలనీల్లో గల ఆలయాల సముదాయం హరిహరక్షేత్రంలోని ఆలయాల్లో ఉదయం నుండి సంప్రోక్షణ తర్వాత యథావిధిగా స్వామివార్లకు పూజలు మొదలయ్యాయి. ఆలయాల్లో పరిసర కాలనీల భక్తులు పూజలు చేయించారు.



ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మన్యు సూక్త హోమం



శరన్నవరాత్రి ఉత్సవ ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

శరన్నవరాత్రి ఉత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

హయత్‌నగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ఓల్డ్‌విలేజీలో ఉన్న శ్రీచక్ర సహిత మహామాయి రాజరాజేశ్వరీదేవి ఆలయం వద్ద సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీశరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికలను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దాదాపు 400సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ప్రతి ఏటా దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని నిర్వాహకులను కోరారు. ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆగమయ్యాయాదవ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగని శ్రీను, ఆలయ అర్చకులు విశ్వేశ్వరయ్య, నాయకులు బొడ్డుపల్లి జనార్దన్, ఎర్ర శ్రీకాంత్, సూర్యానాయక్, ఆలయ కమిటీ నాయకులు రాములు పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన

చంపాపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ పద్మానగర్‌కాలనీలో సోమవారం తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో తాగునీటి, డ్రైనేజీ పైపులైన్లు ఒకే దగ్గర ఉండటంతో తాగునీరు కలుషితం అవుతుండటంతో 185 మీటర్ల పొడవున నూతన పైపులైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాలనీలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజలు తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో జల మండలి మేనేజర్ రమ్యభారతి, కాలనీ అధ్యక్షుడు జయవర్ధన్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, హరిరావు, రఘుమారెడ్డి, నాయకులు లింగాల దశరథ్‌గౌడ్, సుంకరి రమేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న పారిజాతారెడ్డి, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో మాజీ మేయర్

సరూర్‌నగర్ : నగరంలోని గాంధీభవన్‌లో పార్టీ సంస్థాగత నిర్మాణం, బీసీ డిక్లరేషన్ తదితర అంశాలపై చర్చించే నిమిత్తం సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో టీపీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ సమావేశంలో పార్టీ బలోపేతంపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆమె చెప్పారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

వనస్థలిపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం మంత్రి శ్రీధర్‌బాబును కార్పొరేటర్ మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే ప్రాధాన్యత క్రమంలో భాగంగా పరిష్కరిస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని, ప్రజాసమస్యల పరిష్కారమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.



వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరుతున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి



గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా.
- మన్సూరాబాద్, ఆంధ్రజ్యోతి

టన్నెల్ పనులు పెద్దచెరువు నాలాకు మళ్లిస్తేనే మేలు

● జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్యనగర్‌కాలనీ మీదుగా టన్నెలింగ్ పనులు చేపడితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయని, ఈ పనులను పెద్దచెరువు నాలాకు మళ్లిస్తేనే మేలు చేకూరుతుందని డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆగమయ్యనగర్‌కాలనీ మీదుగా చేపడుతున్న పనులపై కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సోమవారం ఆ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భం గా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జరుపుతున్న టన్నెల్ పనులతో కాలనీలో ఇళ్లు, రహదారులు, నీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల వ్యవస్థకు ముప్పువాటిల్లనుందని, వర్షాకాలంలో మరింతగా ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఈ పనులను కేఎల్ఎం ప్రాంతం నుంచి నేరుగా పెద్దచెరువు నాలాకు మళ్లించాలని అధికారులను నర్సింహారెడ్డి కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పోచ



ఆగమయ్యనగర్‌లో చేపడుతున్న టన్నెలింగ్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

బోయిన ఈశ్వరమ్మయాదవ్, యాద య్య, సుధా, సుజాత, శ్రీరాములు, బాలరాజ్‌గౌడ్, ఆంజనేయులు, వెంకటయ్యగౌడ్, వెంకటాచారి, లచ్చిరెడ్డి, గోవర్ధన్, ముత్రం, ఖాసీం పాల్గొన్నారు.

నీలకంఠ విద్యాపీఠంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మజీద్‌పూర్ గ్రామంలో పేదలకు ఇచ్చిన సీలింగ్ భూములను ఆక్రమించిన నీలకంఠ విద్యాపీఠంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గ్రామానికి చెందిన బాధిత రైతులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వేనంబర్ 161, 162, 163లో గల 14 ఎకరాల సీలింగ్ భూమిని నీలకంఠ విద్యాపీఠం వారు ఆక్రమించారని తెలిపారు. అదే విధంగా సర్వేనంబర్ 88, 89, 74లో డొడ్డిదారిన సేల్‌డీడ్‌లు చేసుకున్నారని తెలిపారు. గ్రామంలో 35 సంవత్సరాల క్రితం సీలింగ్ పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. వారందరికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రమేష్, వెంకటేష్, జంగయ్య, సత్తయ్య పాల్గొన్నారు.



సీలింగ్ భూములు ఆక్రమించారని మజీద్‌పూర్‌లోని నీలకంఠ విద్యాపీఠంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

భూదానం భూమిని కాపాడి పేదలకు ఇప్పించండి

మజీద్‌పూర్ గ్రామంలోని సర్వేనంబర్ 34, 35లో ఉన్న భూదాన భూమిని బాలాజీ రియల్ ఎస్టేట్‌కు చెందిన అశోక్‌కుమార్‌గౌడ్ ఆక్రమించుకుని అందులో మామిడి తోటను ఏర్పాటు చేసుకున్నాడని పలువురు గ్రామస్థులు ఎమ్మెల్యే రంగారెడ్డికి ఫిర్యాదు చేశారు. మజీద్‌పూర్ గ్రామంలో భూమిలేని నిరుపేదలు ఎందరో ఉన్నారని వారికి భూదానం భూమిని ఇప్పించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్ : టీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ హైకోర్ట్ కాలనీ, ఆటోనగర్, డీర్‌పార్క్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో నిర్వహణ పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ హైకోర్ట్‌కాలనీ, ఆటోనగర్, డీర్‌పార్క్ ఫీడర్ల పరిధిలోని హుడాసాయినగర్, సుష్మాసాయినగర్, ద్వారకానగర్, ఆటోనగర్ ఇండస్ట్రీయల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని మహిళ మృతి

బర్కత్‌పుర: పట్టాలు దాటుతూ రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 35ఏళ్ల గుర్తు తెలియని మహిళ ఫలక్‌నుమా-బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా సోమవారం రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు రూ.5లక్షలు మంజూరు చేయండి

హయత్‌నగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కొహెడాలోని సురవరం సుధాకర్‌రెడ్డి కాలనీలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లకు రూ.5లక్షలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే చాలా మంది ఇళ్లు నిర్మించుకుని డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు.



రూ.5లక్షలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేత మాధవరెడ్డి

కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నారాయణ రెడ్డి, బాలయ్య, శ్రీను, నరేందర్‌గౌడ్, జగన్మోహన్ రెడ్డి, అంజమ్మ, ఫాతిమా, లక్ష్మమ్మ, నిర్మల, సంతోష పాల్గొన్నారు.

క్రమశిక్షణ నేర్పేది ఉపాధ్యాయులే : వాసుదేవ్

కొత్తపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో క్రమశిక్షణ, నడవడికలను నేర్పేది ఉపాధ్యాయులేనని విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి వీరమల్ల వాసుదేవ్ అన్నారు. సోమవారం కొత్తపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రధానోపాధ్యాయుడు నర్సింహకు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు విజేందర్‌రెడ్డికి, ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు కూడా



వాసుదేవ్, భాగ్యమ్మ దంపతులతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

వాసుదేవ్, భాగ్యమ్మ దంపతులకు సన్మానం చేశారు. కృష్ణారెడ్డి, గణేశ్, చంద్రలేఖ, శైలజ, జితేందర్‌రెడ్డి, రమేష్, శాంతాసాయి పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించడమే వీఆర్‌పీ లక్ష్యం

మన్సూరాబాద్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా విద్య, వైద్యం అందించడమే విద్యార్థుల రాజకీయ పార్టీ(వీఆర్‌పీ) లక్ష్యమని ఆపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు యెచ్చు సునీల్ పేర్కొన్నారు. రానున్న ఉప, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆర్కేపురం డివిజన్ పరిధి అలకాపురి సిగ్నల్ సమీపంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యెచ్చు సునీల్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు, నిరుద్యోగ యువత, పెన్షనర్లు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తన రాజకీయ ఎదుగుదలకు తీన్మార్ మల్లన్న ప్రజలను ఒక్కోసారి ఒక్కో విధంగా మభ్యపెడుతూ నేడు బీసీ కార్డును ముందేసుకున్నాడని, మల్లన్నను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు తమ సమస్యలు, హక్కులను కాపాడుకోవాలంటే రానున్న జూబ్లీహిల్స్ ఎన్నికల్లో వీఆర్‌పీకి మద్దతుగా నిలబడాలని సూచించారు. వీఆర్‌పీ రాష్ట్ర కార్యదర్శి కమలాకర్, ఈసీ మెంబర్ అనిల్, ఎల్బీనగర్ ఇన్‌చార్జి అనికేత్, అనిల్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్

వాటర్ సంప్ నిర్వహణపై బడంగ్‌పేట్ అధికారుల నిర్లక్ష్యం

● సంపుకు పెద్ద రంధ్రం.. అక్కడే ప్లేట్లు, చేతులు శుభ్రం

● తాగునీరు కలుషితంతో పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

● బీజేపీ నేతల ఆందోళన

సరూర్‌నగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం మొత్తం గ్రామానికే ప్రమాదం తెచ్చిపెట్టేలా ఉన్నదని బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉన్న తాగునీటి సంపుకు పెద్ద రంధ్రం ఉన్నదని, అక్కడే స్కూల్ పిల్లలు మధ్యాహ్న భోజనం సమయంలో చేతులు, ప్లేట్లు కడుక్కుంటున్నారని, దాంతో సంపులోని తాగునీరు కలుషితం అవుతున్నదని వారు వాపోయారు. దీని వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని వారు పేర్కొన్నారు. సోమవారం బీజేపీ క్లస్టర్-1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు నడికుడ యాదగిరి, గుర్రం మల్లారెడ్డి, గౌర శ్రీనివాస్, కుంటి భాస్కర్, జగదీశ్వర్‌రాజు, సైదులు, ప్రవీణ్‌గౌడ్, సాయిలు తదితరులు వాటర్ సంపును సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపుకు గల రంధ్రాన్ని మూసి వేయకపోతే తాగునీరు పూర్తిగా కలుషితమై ప్రజల ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మరోపక్క విద్యార్థులు సైతం అందులో పడిపోయే ప్రమాదం ఉన్నదని వాపోయారు. ఇటీవల తాము ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా ఇంత వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆరోపించారు. గ్రామం మొత్తానికి ఈ సంపు నుంచే నీటి సరఫరా జరుగుతున్నందున వెంటనే ఇక్కడి నుంచి సరఫరా ఆపేసి, సంపుకు గల రంధ్రాన్ని మూసేసి, సంపును శుభ్రం చేసేంతర్వాత నీటి సరఫరా పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. బీజేపీ నేతలు తాత్కాలికంగా సదరు రంధ్రం వద్ద ప్లాస్టిక్ జాలీ ఏర్పాటు చేశారు.



వాటర్ సంప్‌కు ఉన్న రంధ్రానికి జాలీ ఏర్పాటు చేసిన బీజేపీ నేతలు



సరూర్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్, ఏఈ నావేద్

వేలాడే విద్యుత్ తీగలను సరిచేయండి

● కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్

ఎల్‌బీనగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల్లోగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ సూచించారు. సోమవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ ఏఈ నావేద్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారి మండపాల వద్ద వేలాడే విద్యుత్ తీగలతో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వేలాడే విద్యుత్ తీగలను సరిచేయించి సురక్షితంగా ఉండేలా చూడాలని సూచించారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో ఎక్కడైనా ఇలాంటి పరిస్థితి ఉంటే ముందుగానే స్పందించి సురక్షిత వాతావరణం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సరూర్‌నగర్ మాజీ అధ్యక్షుడు గోవర్ధన్, కబీర్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, కార్తీక్, ఇతర న్యాయవాదులు

బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీధర్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా దుగుంట్ల శ్రీధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ న్యాయవాదులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలుస్తామన్నారు. బీసీ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు. కన్వీనర్‌గా ఎన్నికైన శ్రీధర్‌ను రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేరి ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాసెట్టి కార్తీక్, మాజీ అధ్యక్షులు దీకొండ రవీంద్ర, దేవరాజ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మట్టపల్లి శ్రీనివాసరావు, పీటం ప్రదీప్ పాల్గొన్నారు.

భవనంపై నుంచి దూకి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఓ రిటైర్డ్ ఉద్యోగి కూకట్‌పల్లిలో తను నివాసం ఉంటున్న భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కైత్లాపూర్ మెయిన్‌రోడ్డు మెరీనా స్కై గేటెడ్ కమ్యూనిటీ పెందుర్తి వీరరాజు(67), సత్యవతి దంపతులు ఏడాది కాలంగా నివాసం ఉంటున్నారు. రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి అయిన వీరరాజుకు 2020 మెదడులో బ్లడ్ క్లాట్ అయింది. అప్పటి నుంచి ఆయన నరాల బలహీనతతో బాధపడు తుండేవారు. పలు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న నయం కాకపోవడంతో సోమవారం ఉదయం తను నివాసం ఉండే ఫ్లాట్ బాల్కనీ నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వీరరాజు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పెందుర్తి వీరరాజు(ఫైల్)

ప్రేమపేరుతో బాలికపై లైంగిక దాడి

● యువకుడి అరెస్ట్

బంజారాహిల్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికపై లైంగిక దాడి చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేపాల్‌కు చెందిన బాలిక(13) జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలో తల్లిదండ్రులతో కలిసి నివాసముంటుంది. పదవతరగతి చదువుతున్న బాలిక ప్రతీ రోజు పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో న్యూడిల్స్ దుకాణం ముందు ఆగేది. అక్కడే పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన కృష్ణతో పరిచయం ఏర్పడింది. కృష్ణ బాలికను మాటల్లోకి దించి ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అతడి మాట విన్న బాలిక ఇంట్లో ఎవరికి చెప్పకుండా అతడి వద్దకు వచ్చేసింది. న్యూడిల్స్ దుకాణంలో ఆమెతో రెండు రోజులపాటు కాపురం చేసి నేపాల్‌కు పారిపోవాలని కృష్ణ పతకం వేశాడు. కుమార్తె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి 24 గంటల్లోనే బాలిక న్యూడిల్స్ దుకాణంలో ఉన్నట్టు గుర్తించారు. బాలికను ప్రశ్నించగా లైంగిక దాడి జరిగినట్టు నిర్ధారణ అయింది. ఆమెను భరోసా కేంద్రానికి తరలించారు. కృష్ణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.